సాక్షి
తిరుపతి

సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



అంతరిక్షం.. అంతు చూద్దాం!
ఇస్రో మరిన్ని భారీ ప్రయోగాలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.13,598 కోట్లు మంజూరు చేసింది. - 8లో



రాష్ట్రస్థాయి పోటీలకు 'పేట' విద్యార్థులు
రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు నాయుడుపేట, సూళ్లూరుపేటకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఎంపికయ్యారు. - 8లో



రోడ్డు ప్రమాదంలో భక్తురాలి మృతి
తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వస్తున్న ఓ భక్తురాలిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. - 8లో

న్యూస్‌రీల్

కుక్ పోస్టులకు ఇంటర్వ్యూలు

తిరుపతి సిటీ: ఎస్వీ వేదిక్ వర్సిటీలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన వంట మనిషి పోస్టులకు సోమవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై, అనుభవం ఉన్న అభ్యర్థులు అర్హులని వెల్లడించారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సోమవారం మహాకుంభ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. విభిన్న అకడమిక్ సంస్థలు సమావేశంలో పలు అకడమిక్ విషయాలకు సంబంధించి చర్చించనున్నారు.

కలెక్టరేట్‌లో నేడు గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తోపాటు జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారు. జిల్లా వాసులు తమ సమస్యలను తెలియజేవచ్చు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు



మొక్క నాటుతున్న చంద్రశేఖర్

శ్రీకాళహస్తి : విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం తొట్టంబేడు ప్రభుత్వ బీసీ బాలిక వసతిగృహంలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ పిల్లలు ఎలా చదువుకుంటున్నారో అనే విషయాలను తల్లిదండ్రులు సైతం గమనించాలని సూచించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ క్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు.

మీన మేషాలు!

జిల్లా మత్స్యశాఖ అచేతనంగా మారిపోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో చేపపిల్లల పెంపకం నిలిచిపోయింది. దీంతో వేలాది మంది జాలర్ల బతుకులను భారంగా మారింది. అయినప్పటికీ మార్గదర్శకాలు విడుదల చేయడంలో ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తోంది. ఈక్రమంలోనే ఫిష్ ఆంధ్ర దుకాణాలను మూయించి బడుగు జీవుల పొట్టకొడుతోంది. చెరువుల్లో చేపల వేలం ద్వారా పంచాయతీలకు సమకూరే ఆదాయానికి గండికొడుతోంది. ఒకప్పుడు కళకళలాడిన మత్స్య పరిశ్రమను పూర్తిగా నిర్వీర్యం చేస్తోంది.

- నిస్తేజంగా జిల్లా మత్స్యశాఖ
- ఊసే లేని చేపపిల్లల పెంపకం
- ఇప్పటికీ అందని ప్రభుత్వ మార్గదర్శకాలు
- శిథిలావస్థకు చేరిన తొట్టెలు
- మూతపడిన ఫిష్ ఆంధ్ర దుకాణాలు
- ప్రారంభానికి నోచుకోని మత్స్యదర్శిని భవనాలు



గత ప్రభుత్వంలో చేపపిల్లల పెంపకంతో కళకళలాడుతున్న తొట్టెలు



ప్రస్తుత సర్కారు నిర్లక్ష్యంతో పూర్తిగా దెబ్బతిన్న చేపల తొట్టెలు

తిరుపతి అర్బన్ : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మత్స్య పరిశ్రమ ఓ వెలుగు వెలిగింది. సర్కారు లక్ష్యాలను అందిపుచ్చుకున్న జిల్లా మత్స్యశాఖ అధికారులు ఏటా కోటికి పైగా చేపపిల్లలను తెనాలి నుంచి తెప్పించేవారు. 10 ఎకరాల విస్తీర్ణంలోని తిరుపతి మత్స్యశాఖ జిల్లా కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 14 చేపపిల్లల తొట్టెల్లో సెప్టెంబర్, అక్టోబర్ (రెండు నెలలు) జాలర్ల పర్యవేక్షణలో పెంచేవారు. తర్వాత నవంబర్ 1 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు పంచాయతీరాజ్, ఇరిగేషన్ పరిధిలోని 250 చెరువుల్లో చేపపిల్లలను వదిలిపెట్టేవారు. అలాగే కాళంగి, అరణియార్, కల్యాణిడ్యామ్ తదితర ప్రాజెక్టుల్లో సైతం ,మార్కెట్‌లో డిమాండ్ ఉండే చేపపిల్లలను వదిలిపెట్టేవారు. ముందుగా ఏ చెరువుకు నీరు చేరి నిండితే అందులో చేపపిల్లలను వదిలేవారు. తర్వాత ఏటా మార్చి, ఏప్రిల్‌లో మత్స్యశాఖ చేపపిల్లలు వదిలిపెట్టిన చెరువులను వేలం వేసేవారు. దీంతో మత్స్యశాఖకు భారీగా ఆదాయం వచ్చేది.దీంతో అనేక మందికి ఉపాధి లభించేది. ప్రజలకు సైతం మేలురకమైన, ఆరోగ్యానికి ప్రయోజనాన్ని చేకూర్చే చేపలు తినేందుకు లభించేవి.

దుకాణాల మూత

తిరుపతి మత్స్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో నాలుగు చేపలు విక్రయ దుకాణాలను ఏర్పాటు చేశారు. పిష్ ఆంధ్ర కింద మత్స్యకారులకు అద్దెకు ఇచ్చేవారు. అయితే ప్రభుత్వం మారడంతో ఆ దుకాణాలు సైతం మూతపడ్డాయి. దీంతో ఆ దుకాణాలు తాగుబోతులకు అడ్డాగా మారిపోయాయి. రాత్రి 7 గంటలు దాటితే మందుబాబులు అక్కడే మద్యం దుకాణాలు తెరిచేస్తున్నారు. ఇప్పుడు అక్కడకు వెళితే ఎటు చూసినా మద్యం సీసాలే కనిపిస్తున్నాయి.



మూతపడిన మత్స్యశాఖ చేపల దుకాణాలు



చిట్టడవిని తలపిస్తున్న మత్స్యశాఖ కార్యాలయ ప్రాంగణం



మందుబాబుల అడ్డాగా మారిన మూతపడిన దుకాణాలు

ఆ జాడే లేదు..!

ఈ ఏడాది తెనాలి నుంచి లేదా ఇతర ప్రాంతాల నుంచి ఒక్క చేపపిల్లను కూడా మత్స్యశాఖ అధికారులు తెప్పించలేదు. దీనికితోడు చేపపిల్లలను పెంచే తొట్టెలను పట్టించుకోకపోవడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇక్కడి విద్యుత్ మోటార్ సైతం ఇటీవల చోరీకి గురైందని అధికారులే చెబుతున్నారు. దీంతో నీటి సమస్య తలెత్తిందని, అందుకే చేపపిల్లల పెంపకం చేపట్టలేదని చెప్పుకొస్తున్నారు. అయితే ఇప్పటికీ ప్రభుత్వం నుంచి చేపపిల్లల పెంపకంపై మార్గదర్శకాలు అందలేదని కొందరు ఉద్యోగులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతాన్ని ప్రతి నెలా శుభ్రం చేసేవారు. ఇప్పుడు నాలుగు నెలలుగా ఎవరూ ఈ దిశగా కన్నెత్తి చూడకపోవడంతో జిల్లా మత్స్యశాఖ కార్యాలయం ప్రాంగణం చిట్టడవిని తలపిస్తోంది. పాములు తదితర విషజీవులను నిలయంగా మారిపోయింది. దీంతో చుట్టపక్కల నివసించేవారు భయాందోళనకు గురవుతున్నారు.

ప్రారంభించకనే శిథిలం!

మత్స్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో రూ.3కోట్లకు పైగా ఖర్చు చేసి పలు భవనాలు నిర్మించారు. అయితే ఇప్పటికీ అవి ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయని పలువురు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశంలోని పలు రకాల చేపలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని మత్స్య దర్శిని భవనం నిర్మించారు. అయితే ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు దేపట్టలేదు. దీంతో ఆ భవనం ప్రాంగణంలో స్థానికులు చెత్తాచెదారాలను వేసి డంపింగ్ యార్డుగా మార్చేస్తున్నారు. ఇటీవల కొందరు ఆకతాయిలు ఆ చెత్తకుప్పలకు నిప్పుపెట్టడంతో భారీగా మంటలు సైతం చెలరేగడం గమనార్హం. అయినప్పటికీ మత్స్యశాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు ఉండిపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు.



ప్రారంభోత్సవానికి నోచుకోని మత్స్యదర్శిని భవనం

ఆదేశాలు అందలేదు



"తెనాలి నుంచి చేపపిల్లల దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. అలాగే చేపపిల్లల పెంపకంపై కూడా మార్గదర్శకాలు విడుదల చేయలేదు. వచ్చిన వెంటనే ఆమేరకు చర్యలు చేపడతాం. దెబ్బతిన్న చేపపిల్లల తొట్టెలకు మరమ్మతు చేయిస్తాం. గతంలో విద్యుత్ మోటార్ అపహరణకు గురైంది. ఆ స్థానంలో కొత్త మోటార్ ఏర్పాటు చేస్తాం. సిబ్బంది కొరత కూడా మత్స్యశాఖను వెంటాడుతోంది. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తాం.

– నాగరాజు, మత్స్యశాఖ జిల్లా అధికారి

స్టాండింగ్ విజయం మనదే!

- నమ్మకానికి మరోపేరు వైఎస్సార్‌సీపీ నేతలు
- కార్పొరేటర్లందరూ మా కుటుంబసభ్యులే..
- మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



మాట్లాడుతున్న భూమన, పక్కన ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సుబ్రమణ్యం, అభినయ్

తిరుపతి మంగళం : తిరుపతి కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల్లో విజయం వైఎస్సార్‌సీపీదేనని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి పద్మావతిపురంలోని నివాసంలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డితో కలిసి కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కరుణాకరరెడ్డి మాట్లాడుతూ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో తిరుపతి కార్పొరేషన్‌లో 48మందిని కార్పొరేటర్లుగా గెలిపించుకున్నామన్నారు. కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలను కుటుంబసభ్యులుగానే భావిస్తుంటామని వెల్లడించారు. పార్టీ ఓడిపోయిన తర్వాత కొందరు వెళ్లిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ 30మంది కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు తమతోనే ఉండడం గర్వంగా ఉందని తెలిపారు. సంక్షోభంలో కూడ వీడిపోని మీ రుణం ఏమిచ్చి తీర్చుకోగలమన్నారు. అక్టోబర్ 4వ తేదీన నిర్వహించనున్న కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల్లో ఐదుగురు కమిటీ సభ్యులను గెలిపించుకుని జగనన్నకు కానుకగా అందిద్దామని పిలుపునిచ్చారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా కార్పొరేటర్లు తలొగ్గకుండా వైఎస్సార్‌సీపీలోనే ఉండడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ పార్టీ అధికారంలో లేకపోయినా నమ్మిన నాయకుడు భూమన కరుణాకరరెడ్డిని వీడకుండా వెన్నంటి ఉండడం ఆనందంగా ఉందని తెలిపారు. భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల్లో ఒక్కో కార్పొరేటర్ ఒక్కో సభ్యుడికి 5 ఓట్లు వేయాలని సూచించారు. గత ఐదేళ్లలో ఎవరితో అయినా పొరబాటున నిర్లక్ష్యంగా వ్యవహరించి ఉంటే క్షమించాలని కోరారు.

రుణం తీర్చుకుంటాం

వైఎస్సార్‌సీపీనే నమ్ముకున్నందుకు కార్పొరేటర్లుగా నిలబెట్టి, గెలిపించి సమాజంలో హోదా కల్పించిన జగనన్న, కరుణన్న రుణం తీర్చుకుంటామని కార్పొరేటర్లు స్పష్టం చేశారు. పార్టీ నిలబెట్టిన స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులను గెలిపించుకుంటామని ప్రమాణం చేశారు.

ప్రాక్టికల్స్ నిర్వహించకుంటే చర్యలు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్ అకడమిక్ క్యాలెండర్‌కు అనుగుణంగా జిల్లాలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో తప్పనిసరిగా విద్యార్థులతో ప్రాక్టికల్స్ నిర్వహించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రాక్టికల్స్‌కు అనుగుణంగా ల్యాబ్‌లు, ప్రయోగ పరికరాలు, రసాయనాలను సిద్ధం చేసి తరగతులను నిర్వహించాలన్నారు. ఈ మేరకు ఇప్పటికే అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలలకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. అలాగే ఈ నెల 4వ తేదీ అన్ని యాజమాన్య కళాశాలల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేసి ప్రాక్టికల్స్ నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. రోజు వారీ ప్రాక్టికల్స్ తరగతులను నిర్వహించి వాటికి సంబంధించిన ఫొటోలు, వీడియో ఫుటేజీలు, రికార్డులను సమర్పించాలన్నారు. నిబంధనలు పాటించకుంటే చర్యలకు వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు.



ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఐఓ

పీజీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో నిర్వహించిన పీజీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎంఏ సోషల్ వర్క్, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంఏ ఫర్మామెన్స్ ఆర్ట్స్‌కు సంబంధించి నాలుగో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశామని వెల్లడించారు. ఫలితాల కోసం విద్యార్థులు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

జాతరకు వేళాయె!



వెంకటగిరి గ్రామదేవత పోలేరమ్మ జాతర ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. . ఘటోత్సవంతో అమ్మవారి సంబరం మిన్నంటింది.. తరలివచ్చిన అశేష భక్త జనంతో పట్టణం కిక్కిరిసింది.. ఉత్సాహంగా యువత కదంతొక్కింది.. చల్లంగా చూడు పోలేరమ్మ తల్లీ అంటూ ప్రణమిల్లింది.. విశేష పూజలు నిర్వహించి ఆధ్యాత్మిక ఆనందంతో పులకించింది. శక్తిస్వరూపిణిని సేవించుకుని తరించింది.
– వెంకటగిరి రూరల్/సైదాపురం

క్లుప్తంగా

ముక్కంటి సేవలో సినీ నటి నమిత



రాహుకేతు పూజలో నమిత దంపతులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి వారిని సినీ నటి నమిత దంపతులు సేవించుకున్నారు. ఆదివారం ఆలయం వద్ద వారికి అసిస్టెంట్ కమిషన్ మల్లికార్జున ప్రసాద్ స్వాగతం పలికారు. అనంతరం వారు రూ.5వేల టికెట్ తీసుకుని సహస్ర లింగం వద్ద రాహుకేతు పూజలు నిర్వహించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. జ్ఞాపికను బహూకరించారు.

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో చోటు



జయశంకర్‌ను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: ఎస్వీయూ భౌతికశాస్త్ర విభాగపు విశ్రాంత ప్రొఫెసర్ సీకే జయశంకర్‌కు ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో చోటుదక్కింది. ఈ మేరకు స్టాన్‌ఫోర్డు యూనివర్సిటీ, నెదర్లాండ్‌కు చెందిన ఎల్స్ వీయర్ సంస్థ సంయుక్తంగా రూపొందించిన జాబితా విడుదల చేసింది. ప్రపంచంలోని 6,459 మంది శాస్త్రవేత్తలలో జయశంకర్ 3,777 స్థానం సంపాదించారు. ఈ సందర్భంగా వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆయన్ను అభినందించారు.

అనారోగ్యంతో బాలుడి మృతి

తిరుపతి మంగళం : మంగళం పరిధిలోని ప్రభుత్వ పరిశీలన గృహంలో ఉన్న ఓ బాలుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆరు నెలల కిందట భాకరాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన అత్యాచార కేసులో నిందితుడిగా ఉన్న గుడియాత్తం ప్రాంతానికి చెందిన వేలు అనే బాలుడు రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. ప్రభుత్వ పరిశీలన గృహం అధికారులు రూయ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతిచెందాడు.

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) భారీ ప్రయోగాలకు సన్నద్ధమవుతోంది. అనంత విశ్వంపై విజయం సాధించేందుకు సమాయత్తమవుతోంది. అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా చాటేందుకు సన్నాహాలు చేసుకుంటోంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం సైతం పూర్తి సహకారం అందిస్తోంది. ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల రూపకల్పనకు రూ.13,598 మంజూరు చేసింది. ఈ మేరకు కేబినెట్ సైతం ఆమోదం తెలిపింది.

- ఇస్రో ప్రయోగాలకు రూ.13,598 కోట్లు
- రూ.8,239 కోట్లతో నెక్ట్స్ జనరేషన్ స్పేస్ వెహికల్
- రూ.2,019 కోట్లతో గగన్‌యాన్
- రూ.1,236 కోట్లతో శుక్రయాన్
- రూ.2,104 కోట్లతో చంద్రయాన్–4
- ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్

ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న గగన్‌యాన్ క్రూమాడ్యూల్ ఎస్కేప్ సిస్టమ్ చిత్రం



అంతరిక్షం.. అంతు చూద్దాం!

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) భారీ ప్రయోగాల లక్ష్యంగా పని చేయాల్సిన సమయం ఆసన్నమైంది. 2040 వరకు ప్రతిష్టాత్మక ప్రయోగాలను చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించుకుంది. అందులో భాగంగా తొలుత నెక్ట్స్ జనరేషన్ స్పేస్ వెహికల్ (ఎన్‌జీఎస్‌వీ)అనే రాకెట్‌ను అభివృద్ధి చేసుకోవాల్సి వుంది. గగన్‌యాన్ ప్రయోగాల పరంపరలో వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లి తిరిగి తీసుకొచ్చే ప్రక్రియను చేపట్టాల్సి వుంది. ఇప్పటిదాకా చంద్రయాన్, సూర్యయాన్, మంగళ్‌యాన్ లాంటి గ్రహాంతర ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించిన ఇస్రో ఇప్పుడు శుక్రయాన్ పేరుతో శుక్రగ్రహం (వీనస్)పై పరిశోధనలకు ఉపగ్రహ ప్రయోగానికి సన్నద్ధం అవుతోంది. అలాగే చంద్రుడిపైకి వ్యోమగాములను పంపించి తీసుకొచ్చేందుకు చంద్రయాన్–4 ప్రయోగానికి సైతం సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం కేంద్ర కేబినెట్ రూ.13,598 కోట్లు కేటాయించినట్లు ఇస్రో ఇటీవలే వెల్లడించింది.

నెక్ట్స్ జనరేషన్ స్పేస్ వెహికల్

భవిష్యత్‌లో వ్యోమగాములను రోదసీలోకి తీసుకెళ్లి తిరిగి మళ్లీ భూమికి తీసుకొచ్చేందుకు భారీ రాకెట్‌ను తయారు చేసుకునేందుకు నెక్ట్స్ జనరేషన్ స్పేస్ వెహికల్ తయారు చేయాలని ఇస్రో నిర్ణయించింది. ఈ వెహికల్‌ను రూపకల్పనకు రూ.8,239 కోట్లు కేటాయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ క్రమంలోనే షార్ కేంద్రంలో రన్‌వే కూడా నిర్మించుకోవాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే ఎల్‌వీఎం3 లాంటి భారీ రాకెట్‌తోపాటు మరో భారీ రాకెట్ కూడా అవసరమవుందని కేంద్ర ప్రభుత్వం సైతం గుర్తించింది. అందుకే ఎన్‌జీఎస్‌వీ రాకెట్ తయారీకి అవసరమైన నిధులు మంజూరు చేసింది.

శుక్రగ్రహంపై పరిశోధనలు!

ఇప్పటికే ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రుడు, సూర్యుడు, అంగారకుడిపై పరిశోధనల నిమిత్తం ప్రయోగాలు చేసి విజయాలు నమోదు చేసుకున్నారు. తాజాగా శుక్రగ్రహంపై కూడా పరిశోధనలు జరిపేందుకు కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ రూ.1,236 కోట్లకు ఆమోదం తెలియజేసింది. అంటే చంద్రయాన్, సూర్యయాన్, మంగళ్‌యాన్ ప్రయోగాలు చేసిన తరువాత శుక్రయాన్ పేరుతో శుక్రగ్రహంపై పరిశోధనలు చేయడానికి శాస్త్రవేత్తలు సన్నాహాలు చేసుకుంటున్నారు.

మానవ సహిత ప్రయోగానికి సిద్ధం

గగన్‌యాన్ ప్రాజెక్ట్‌కు కూడా రూ.2,019 కోట్లు విడుదల చేసేందుకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇస్రో శాస్త్రవేత్తలు 2006లో గగన్‌యాన్ ప్రాజెక్టు ప్రారంభించారు. ఇప్పటి వరకు అనేక పరీక్షలు నిర్వహించి విజయాలు సాధించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో మానవ రహిత ప్రయోగంలో భాగంగా క్రూమాడ్యూల్ ఎస్కేప్ సిస్టమ్ పేరుతో మరో ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. ఇలాగే మరో రెండు సార్లు మానవ రహిత ప్రయోగాలు చేయనున్నారు. అనంతరం 2025 ఆఖరు నాటికి మానవ సహిత ప్రయోగానికి సన్నద్ధమవుతున్నారు.

చంద్రుడిపై మరిన్ని..

చంద్రుడిపై మరిన్ని పరిశోధనల నిమిత్తం వ్యోమగాములను పంపించేందుక చంద్రయాన్–4 ప్రయోగానికి కూడా ఇస్రో సిద్ధమవుతోంద. ఈ ప్రాజెక్టుకు సైతం కేంద్రః రూ.2,104 కోట్లు మంజూరు చేసింది. అయితే ఇప్పటికే చంద్రయాన్–1, 2, 3 ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. చంద్రయాన్–3 ప్రయోగంలో భాగంగా విక్రమ్ ల్యాండర్‌ను చంద్రడి దక్షిణ ధ్రువంపై ల్యాండింగ్ చేశారు. రోవర్‌ను చంద్రుడి ఉపరితలంపై తిరిగేలా చేశారు. ఒక దశలో రోవర్ ఒక చోటు నుంచి మరో చోటుకు తరలించే ప్రక్రియను కూడా విజయవంతంగా నిర్వహించి ప్రపంచాన్ని అబ్బురపరిచారు. చంద్రయాన్–3 అనుభవాలతో సాంకేతికతను మరింత మెరుగుపరుచుకుని చంద్రయాన్–4 ప్రాజెక్టులో భాగంగా వ్యోమగాములను చంద్రుడిపై దింపేందుకు ఇస్రో సన్నాహాలు చేస్తోంది. అయితే 2040లో ఈ ప్రయోగం అమలు చేసేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించింది. ఈ ప్రాజెక్టును ఛాలెంజ్‌గా తీసుకుని ప్రయోగాలు సాగిస్తోంది.

రిలీవ్ లేని బదిలీ!

- 26 వరకు 'ఇది మంచి ప్రభుత్వం'
- పూర్తయిన తర్వాతే రిలీవ్ చేసే అవకాశం

తిరుపతి అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను అధికారులు ఎట్టకేలకు ఆదివారం సాయంత్రానికి పూర్తి చేశారు. అయితే సోమవారం సదరు ఉద్యోగులను రిలీవ్ చేసేందుకు ప్రభుత్వం అనుమతించలేదు. ప్రచారం కోసం చేపట్టిన ×ఇది మంచి ప్రభుత్వం్ణ కార్యక్రమం ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగనున్న నేపథ్యంలో అప్పటి వరకు ఉద్యోగులు యథాస్థానంలో పనిచేయాలని ఆదేశాలు జారీ చేసింది. 27వ తేదీ నుంచి రిలీవ్ కావడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ క్రమంలో సచివాలయ ఉద్యోగులు మాత్రం సామాజిక పింఛన్లు పంపిణీ చేసిన తర్వాత అక్టోబర్ 4వ తేది రిలీవ్ కావడానికి అవకాశం కల్పించింది. అయితే ఇప్పటి వరకు బదిలీ జాబితా ప్రచురించలేదు. ఉద్యోగులకు సైతం ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ అందించకపోవడం గమనార్హం. కేవలం బదిలీ అయిన ఉద్యోగికి మౌఖికంగానే సమాచారం అందించారు.

సిఫార్సులకే మొగ్గు

ఆప్షన్ ప్రకారం బదిలీలు చేపట్టలేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఉద్యోగికి ఐదు ఆప్షన్లు ఇచ్చారని...ఆ మేరకు వరుస క్రమంలో తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలను పెట్టుకున్నప్పటికీ, తాము నమోదు చేయని ఆరో ఆప్షన్‌కు బదిలీ చేశారని ఉద్యోగులు వాపోతున్నారు. 100 శాతం బదిలీల్లో ఎమ్మెల్యే సిఫార్సులకే ఉన్నతాధికారులు మొగ్గు చూపారని ఆరోపిస్తున్నారు.

విభాగాల వారీగా..

రిజిస్ట్రేషన్ విభాగానికి సంబంధించి జిల్లాలో 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 18 మంది సబ్ రిజిస్ట్రార్లు పనిచేస్తున్నారు. వీరిలో 11 మంది బదిలీ అయ్యారు. శ్రీకాళహస్తికి బాలాజీ, తిరుపతికి నీరజ, లక్ష్మీదేవి, చంద్రగిరికి కొండారెడ్డిని బదిలీ చేశారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఇ.ప్రతాప్‌ను ఏలూరుకు బదిలీ చేశారు. నెల్లూరు అధికారికి తిరుపతి జిల్లా అదనపు బాధ్యతలు అప్పగించారు. డీఆర్‌డీఏ పీడీగా శోభనబాబును నియమించారు. సివిల్ సప్లయి ఏఎస్‌ఓ చంద్రికను కడపకు బదిలీ చేశారు. 395 మంది వీఆర్వోలు బదిలీ అయ్యారు. సచివాలయ ఉద్యోగులు 460 మందికి బదిలీలు వచ్చాయి. ఈ నెల 30వ తేదికి ఎక్సైజ్‌శాఖలో బదిలీల పూర్తిచేయనున్నారు.

తిరుపతి ఎస్‌ఈ చిత్తూరుకు..

తిరుపతి పంచాయతీరాజ్ ఎస్‌ఈ శంకరనారాయణను చిత్తూరుకు బదిలీ చేశారు. ఈఈ సత్యనారాయణరెడ్డి నెల్లూరుకు నంద్యాల నుంచి రామ్మోహన్‌ను తిరుపతి ఈఈగా బదిలీ అయ్యారు. తిరుపతి డివిజన్ ఫారెస్ట్ ఆఫీసర్ సతీష్‌ను కృష్ణాజిల్లాకు అక్కడ పనిచేస్తున్న ఏపీఎస్ ఆర్‌కే అప్పన్నను తిరుపతికి బదిలీ చేశారు. ఇన్‌చార్జి డీపీఎఓ సుశీలాదేవిని డీపీఓగా రెగ్యులరైజ్ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో చంద్రగిరి–2 డీఈ వెంకటరమణను సత్యవేడు–2కి ,సత్యవేడు–1 నుంచి మురళీధర్‌ను నంద్యాలకు, అన్నమయ్య జిల్లా నుంచి శ్రీనివాసులురెడ్డిని చంద్రగిరి–2కి, చిత్తూరు జిల్లా కార్వేటినగరం నుంచి డీఈ శైలజాకుమారిని సత్యవేడు–1కి, వెంకటగిరికి చెందిన శ్రీనివాసులును నెల్లూరు జిల్లా కందుకూరుకు బదిలీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'పేట' విద్యార్థులు



రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన బాలుర జట్టుతో అధికారులు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని బాలుర గురుకుల పాఠశాలలో అండర్–19 నెల్లూరు జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించారు. బాలుర విభాగంలొఓ నాయుడుపేట గురుకులం విద్యార్థులు 8 మంది, బాలికలకు సంబంధించి సూళ్లూరుపేట విద్యార్థినులు 8 మంది ఎంపికైనట్లు కోచ్ ఉదయ్‌కుమార్ తెలిపారు. వీరిఉ ఎన్‌టీఆర్ జిల్లాలో అక్టోబర్ 3, 4వ తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరి శ్రీరేష్, ప్రిన్సిపల్ దాదాపీర్, అబ్జర్వర్ శివయ్య, పీఈటీ భాస్కర్, పీడీ కాటయ్య పాల్గొన్నారు.

వరుడిపై దాడి చేసి వధువు అపహరణ



కోట పోలీస్‌స్టేషన్‌లో హ్యూమన్‌రైట్స్ నాయకులు

కోట: వరుడుపై దాడి చేసి వధువును ఆమె తరపు బంధువులు అపహరించుకెళ్లిన ఘటన ఆదివారం కోటలో కలకలం రేపింది. ఈ మేరకు నెల్లూరుకు చెందిన సోషల్ ప్రొటెక్షన్, హ్యూమన్‌రైట్స్ ఎన్‌జీఓ ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. చిట్టమూరు మండలం, ఈశ్వరవాకకు చెందిన ప్రవళ్లిక, మొలకలపూడి గ్రామానికి చెందిన వంశీ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్న వీరు పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే వారిరువురి కులాలు వేరు కావడంతో ప్రవళ్లికను కుటుంబ సభ్యులు ఉద్యోగం మాన్పించి విద్యానగర్‌లోని బంధువుల ఇంటి వద్ద ఉంచారు. ఈ క్రమంలో ప్రవళ్లిక ఇంటి నుంచి వచ్చేసి వంశీని వివాహం చేసుకుంది. ఆపై నెల్లూరులోని హ్యూమన్‌రైట్స్ నాయకులను ఆశ్రయించడంతో వారు కోట పోలీస్‌స్టేషన్‌కు బయల్దేరారు. ప్రవళిక తరఫు బంధువులు పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో వారిపై దాడికి పాల్పడ్డాడు. ఆపై యువతిని బలవంతంగా తమ కారులో తీసుకుని వెళ్లారు. ఈ మేరకు వారు వాకాడు సీఐ హుస్సేన్‌బాషాకు ఫిర్యాదు చేయగా.. ఆయన ఆదేశాలతో ఎస్‌ఐ పవన్‌కుమార్ విచారణ చేస్తున్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..



కంటైనర్ లారీని ఢీ కొని నుజ్జునుజ్జయిన కారు



గాయపడి చికిత్స పొందుతున్న అమ్మమ్మకు సపర్యలు చేస్తున్న చిన్నారి జశ్వంత్.



మృతి చెందిన బాబు, చిన్నారి వెన్నెల మేఘన, జగదీష్

తమిళనాడులోని తిరువణ్ణామలై వెళ్లారు. అరుణాచలేశ్వరుని దర్శించుకున్నారు. తిరుగుప్రయాణంలో కాణిపాకం వినాయస్వామిని సేవించుకున్నారు. ఆత్మసంతృప్తితో స్వస్థలాలకు బయలుదేరారు. మరో అరగంటలో గమ్యం చేరిపోతామనుకున్నారు. ఇంతలో విధి వక్రించింది. కంటైనర్ రూపంలో పొంచి ఉన్న మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. మూడు నిండు ప్రాణాలను బలితీసుకుంది. ఐదుగురిని తీవ్ర గాయాలపాలు చేసింది. రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. ఈ ఘటన చిల్లకూరు సమీపంలో ఆదివారం జరిగింది.

- ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొన్న కారు
- చిన్నారితోపాటు ముగ్గురి మృతి
- ఐదుగురికి తీవ్ర గాయాలు
- రెండు కుటుంబాల్లో విషాదం

చిల్లకూరు : నెల్లూరు– చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం చిల్లకూరు వద్ద ఆగి ఉన్న కంటైనర్‌ను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా తరలించగా అప్పటికే ముగ్గురు మృత్యువాత పడ్డారు. వివరాలు.. నెల్లూరు నగరానికి సమీపంలోని వనంతోపు, కాకుపల్లెకు చెందిన రెండు కుటుంబాలకు చెందిన బాబు, జగదీష్, లక్ష్మమ్మ, రాధాకుమారి, మాధవి, కిషోర్, కల్యాణి, చిన్నారులు జశ్వంత్, వెన్నెల మేఘనతో పాటు డ్రైవర్ సునీల్ కుమార్ శనివారం కారులో తమిళనాడులోని తిరువణ్ణామలై వెళ్లారు. దైవ దర్శనం చేసుకున్నారు. అనంతరం రాత్రికి కాణిపాకంకు వచ్చి అక్కడ వినాయకుడి దర్శనం చేసుకుని వెంటనే నెల్లూరుకు బయలు దేరారు. ఈ క్రమంలో శ్రీకాళహస్తి వచ్చిన తర్వాత డ్రైవింగ్ చేస్తున్న సునీల్‌కుమార్‌కు నిద్ర వస్తోందని చెప్పాడు. దీంతో జగదీష్ కారు నడిపేందుకు ఉప క్రమించాడు. చిల్లకూరు సమీపంలో కారు అదుపు తప్పి జాతీయ రహదారి పక్కనే నిలిపి ఉన్న కంటైనర్ లారీని వేగంగా ఢీకొంది. దీంతో కారు ముందు భాగం దాదాపు లారీ కిందకు దూసుకెళ్లి నుజ్జునుజ్జయ్యింది. ప్రమాద తీవ్రతకు కారులో ప్రయాణిస్తున్న చిన్నారి జస్వంత్, కిషోర్ తప్ప మిగిలిన వారు తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. కారులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీశారు. 108తోఆపటు స్వర్ణ టోల్ ప్లాజా అంబులెన్స్‌ల్లో క్షతగాత్రులను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించేలోపే చిన్నారి వెన్నెల మేఘన (8), బాబు (48), జగదీష్ (50) మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మిగిలిన ఐదుగురిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు.

కలచి వేసిన ప్రమాదం

రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి వద్ద ఓ చిన్నారి పడుతున్న తపన చూపరులను కంటతడి పెట్టించింది. ఒక వైపు ఇద్దరు తాతలు ఇద్దరు, అక్క వెన్నెల మేఘన మృతదేహాలు కళ్లెదుటే ఉండడంతో చిన్నారి జశ్వంత్(6) తల్లడిల్లిపోయాడు. చికిత్స పొందుతున్న అమ్మమ్మ, తల్లి మరో వైపు గాయాలతో కేకలు వేస్తుంటే అటు ఇటు పరుగులు తీస్తూ దిక్కుతోచక కొట్టుమిట్టాడాడు. అమ్మమ్మ నొప్పిగా ఉందంటే కాళ్లు నొక్కుతూ సపర్యలు చేశారు. పసివాడి పరిస్థితి కలచి వేసింది.


'సిటీ చాంబర్' సేవలు ఆదర్శనీయం



పురస్కార గ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : తిరుపతి సిటీ చాంబర్ గత 27 ఏళ్లుగా అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని అతిథులు కొనియాడారు. తిరుపతి సిటీ ఛాంబర్ ఆధ్వర్యంలో ఆదివారం మహతి కళాక్షేత్రంలో ఉగాది పురస్కారాల ప్రధానోత్సవ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూవివిధ రంగాలలో విశిష్ట సేవలు చేసిన వారిని గుర్తించి ఏటా క్రమం తప్పకుండా తిరుపతి సిటీ చాంబర్ నిర్వాహకులు ఉగాది పురస్కారాలు అందించడం సంతోషకరమన్నారు. అనంతరం డి.రామకృష్ణ, కేవీ రాంగోపాల్, కొత్తపల్లి మునిరత్నం సేవలకు జీవిత సాఫల్య పురస్కారాలు అందించి సత్కరించారు. డాక్టర్ బాలసుబ్రమణ్యం, ఏఎస్‌ఆర్‌ఏన్,.సాయిబాబు, డాక్టర్ రామకృష్ణమూర్తి, డాక్టర్ బి.మమత, ఎస్వీ సంగీత కళాశాల ప్రిన్సిపల్ ఉమా ముద్దుబాల, ఎస్.ప్రియాంక, వి.పద్మావతి, కె.ఖాదర్‌వలీకి ఉగాది పురస్కారాలు, పి.జనార్ధన్, మారియా తనీమ్, మాధురి, కావ్యశ్రీలకు ప్రత్యేక గౌరవ పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తిరుపతి సిటీ చాంబర్ అధ్యక్ష, కార్యదర్శులు ఆయూబ్‌ఖాన్, షణ్ముగం యాదవ్, చైర్మన్ కేఏస్ వాసు, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ జయకుమార్, డాక్టర్ కరుణానిధి, స్వరాజ్యలక్ష్మి, వేణు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సర్పంచ్ భర్తపై దాడి



గాయపడిన వైఎస్సార్‌సీపీ నేత మధు

ఓజిలి: వైఎస్సార్‌సీపీ సర్పంచ్ భర్తపై దాడి చేసి గాయపరిచిన ఘటన తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గం, ఓజిలి మండలం, మాచవరం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. వైఎస్సార్‌సీపీ సర్పంచ్ పిండుకూరు మౌనికారెడ్డి భర్త మధుసూదన్‌రెడ్డి ఇంటి పక్కనే అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త టీ.సుమంత్ గేదెలు కట్టేస్తూ.. ఆ మురికి నీటిని వదులుతున్నాడు. దీనిపై ప్రశ్నించినందుకు సుమంత్ ఆదివారం మధ్యాహ్నం మధుసూదన్‌రెడ్డిపై రాయితో దాడికి దిగాడు. అనంతరం సుమంత్ కుటుంబ సభ్యులు కూడా మధుసూదన్‌రెడ్డిపై దాడిచేశాడు. దాడికి పాల్పడిన సుమంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ప్రైవేట్ టీచర్ల సమస్యలను పరిష్కరించండి



డీఈఓకు విన్నవిస్తున్న ప్రైవేటు టీచర్లు లెక్చరర్ల ఫెడరేషన్ ప్రతినిధులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డీఈఓ డాక్టర్ వీ.శేఖర్‌ను పలువురు విజ్ఞప్తి చేశారు. తిరుపతిలోని ఓ కార్యక్రమంలో డీఈఓను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్ల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.అశోక్‌నాయుడు మాట్లాడుతూ డీఈఓచేత గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని, అలాగే హెల్త్‌కార్డులు, ఈఎస్‌ఐ, పీఎఫ్ అందేలా ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భక్తురాలి మృతి



మృతి చెందిన సరళ

పాకాల : తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వస్తున్న ఓ భక్తురాలు పూతలపట్టు– నాయుడుపేట జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో మృతి చెందింది. వివరాలు.. తమిళనాడులోని వేలూరు జిల్లా గుడియాత్తం మండలం తాటిమానుపల్లెకు చెందిన సరళ(43) పలువురు గ్రామస్తులతో కలిసి కాలినడకన తిరుమలకు బయలుదేరింది. మండలంలోని శంఖంపల్లె సమీపంలో అనంత ఆంజనేయస్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీకొంది. పాకాల పోలీసులు మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ మహేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతికి కల్లూరు పంచాయితీ!

సాక్షి టాస్క్‌ఫోర్స్: దొరవారిసత్రం మండలం కల్లూరు పంచాయతీలో టీడీపీ నేతల మధ్య ఏర్పడిన వివాదం చినికి చినికి గాలివానగా మారి పంచాయితీ అమరావతికి చేరింది. కల్లూరుకండ్రి వర్గానికి నెలవల సుబ్రమణ్యం, కల్లూరు వర్గానికి వేనాటి సతీష్‌రెడ్డి వత్తాసు పలికారు. ఈ క్రమంలో ఆయన కల్లూరు గ్రామానికి చెందిన బాధితులను 5 రోజుల క్రితం అమరావతికి తీసుకెళ్లి మంత్రి లోకేష్‌ను కలిసి జరిగిన విషయం తెలియజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ విషయంలో జరిగిన ఈ వివాదంలో దెబ్బలు తిన్న వారిపై మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం కేసులు పెట్టించారని మొరపెట్టుకున్నట్లు తెలిసింది. నెలవల ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఎన్నికల సమయంలో టీడీపీ అభ్యర్థి విజయం కోసం అహర్నిశలు పనిచేసి ఆ గ్రామంలో మంచి మెజారిటీని తీసుకువచ్చామని, ఇప్పుడు నెలవల సుబ్రమణ్యం మాత్రం ఓ వర్గానికే కొమ్ముకాస్తున్నారని లోకేష్ వద్ద వాపోయినట్లు తెలిసింది. ఓ వర్గానికి నెలవల, మరో వర్గానికి వేనాటి మద్దతుగా నిలవడంతో ఈ వివాదం ఎటు దారితీస్తుందో అని టీడీపీ శ్రేణులు ఆందోళన చెందుతున్నారు.

బాలికపై లైంగిక దాడి

తిరుపతి క్రైమ్: నగరంలోని జీవకోనకు చెందిన ఓ బాలిక(14)పై అన్న వరసయ్యే యువకుడు (20) లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. అలిపిరి సీఐ రామకిషోర్ కథనం మేరకు.. బాధిత బాలిక అమ్మమ్మ ఇంట్లో ఉంటూ 8వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు ఉపాధి కోసం ఆరు నెలల క్రితం బెంగళూరుకు వెళ్లారు. పెద్దమ్మ కొడుకు కూడా అక్కడే ఉండేవాడు. అన్నాచెల్లెలు కావడంతో వీరిని ఇంట్లో వదిలి వెళ్లిపోయారు. ఇదే అదునుగా భావించిన యువకుడు బెదిరించి బాలికను లొంగదీసుకుని పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఎవరికీ చెప్పుకోకుండా తనలో తానే కుమిలిపోయింది. ఇటీవల వినాయక నిమజ్జనం కోసం తల్లిదండ్రులు తిరుపతి కొచ్చారు. ఈ క్రమంలో జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీనిపై బాలిక తల్లిదండ్రులు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

కుక్కల దాడిలో 15 పొట్టేళ్ల మృతి



పొట్టేళ్ల కళేబరాలు

వరదయ్యపాళెం: కుక్కల దాడిలో 15 పొట్టేళ్లు మృతి చెందిన ఘటన మండలంలోని సీఎల్‌ఎన్‌పల్లిలో చోటుచేసుకుంది. సీఎల్‌ఎన్‌పల్లి దళితవాడకు చెందిన వెంపళ్ల రామకృష్ణయ్య, వెంపళ్ల లక్ష్మయ్య, వేమయ్య పొట్టేళ్ల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు. ఆదివారం గ్రామ సమీపంలోని ఆరికిసేను వద్ద క్వారీలకు సమీపంలో పొట్టేళ్లు మేత మేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన కుక్కలు వాటిపై దాడి చేశాయి. ఈ దాడిలో 15 పొట్టేళ్లు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 7 పొట్టేళ్లు తీవ్రంగా గాయపడ్డాయి. బాధిత పెంపకందారులు ఘటనకు సంబంధించి పశు వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

తడ : స్థానిక రైల్వేస్టేషన్ వద్ద రైలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఆదివారం దీనిపై సమాచారం అందడంతో సూళ్లూరుపేట జీఆర్‌పీ ఎస్‌ఐ చెన్నకేశవులు ఘటనాస్థలానికి వెళ్లారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్ కార్డు జిరాక్స్ ఆధారంగా మరణించింది నాబిన్ భీహార (28)గా గుర్తించారు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.